హృదయం నాకు తెలుసు. పరిస్థితులకు తల ఒగ్గక తప్పదు. నిన్ను మరచిపోవడం అంటే నన్ను నేను మరచిపోటమే. నీతో బతికే అదృష్టం లేకపోయినా, కనీసం నీ జ్ఞాపకాల్లోనైనా బతకనీ" అంటుంది.

ఇద్దరికీ కన్నీళ్ళు ఆగవు.

సువర్చలే తన కన్నీళ్ళు తుడుస్తూ "ఛ! ఛ! డోన్ట్ బి సిల్లీ! ఆడపిల్లలా ఏమిటా కన్నీరు? అనుకున్నవన్నీ జరుగుతాయా? జరిగినదంతా ఒక కమ్మని కల అనుకుందాం ఏం?" అంటుంది.

పిచ్చి సువర్చల అనుకుంటూ పదహారో రోజున ఆఫీసులో అడుగు పెట్టిన బాలరాజుకి అడుగు ముందుకి పడలేదు. సువర్చల సీటులో మరో కొత్త అమ్మాయిని చూడగానే.

సువర్చలేది?

"వారం క్రితం ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోయింది"

ఇప్పుడు తను క్షమాపణ ఎవరితో చెప్పుకుంటాడు?

"ట్రాన్సఫరు కావాలనే చేయించుకుందిట" అని ఎవరో అన్నప్పుడు మాత్రం బాలరాజు నమ్మలేదు.

"నా ప్రేమ యిలాంటి వర్త్‌లెస్ ఫెలో మీద వేస్ట్ చెయ్య దల్చుకోలేదు" అని అన్నదని మాత్రం బాలరాజుకి ఈ నాటికీ తెలీదు.

**(ప్రభవ, వార్షిక సంచిక 1.2.1980)**

# ఛీ ! ఛీ !! ఏం మనుషులు !!

**భోం**చేసి నడుంవాల్చేను. ఇంకా రెండు కాళ్లూ పూర్తిగా ముయ్యనేలేదు. అంతే 'రాణీ, రాణీ" అంటూ డైనింగ్ హాల్లోంచి ఓ పొలికేక.

ఇంకెవరు ? సుందరమ్మే.

లేచే లోపున మరోపొలికేక "ఎక్కడ చచ్చావ్?"

ఆహాఁ ఏం సున్నితంతా బాబూ ! అందుకే నాకు ఈవిడంటే రోజు రోజుకీ అసహ్యం పెరిగిపోతోంది.

"అంట్ల దగ్గరికి కాకులొచ్చేయి" మరో గావుకేక.

తెలివంటే నీదేనే సుందరమ్మ తల్లీ అంట్ల దగ్గరకికాకులురాక గండ భేరుండాలు వస్తాయా? ఈ తెలివికి కథలుకూడా రాస్తుందిట. పాపం శమించుగాక !

"పక్కింటి రాజా దగ్గరికి పోయి వుంటుందమ్మా" అంటున్నాడు అరుణ్. ఈయనగారు ఎమ్.బి.ఎ. లో చేరిన క్షణం నుంచి తను "టాటా" జనరల్ మేనేజరు ననుకుంటున్నాడు. స్కూటరు లేకపోతే కాలుకింద పడదు బాబుగారికి. ఇంతకీ నా యిష్టం. రాజాతో కాకపోతే రౌడీతో తిరగడం తప్పా? వీడు తిరగడం లేదూ, యూనివర్శిటీ ఆడపిల్లలతోటి.

అప్పుడే డ్రాయింగురూములోకి వచ్చిన బొజ్జీ "యిదిగో నమ్మా ఫేన్ కింద సోఫాలో హాయిగా నిద్రపోతోంది" అంది. బావుంది జోకు. సోఫామీద కాకోతే సోఫాక్రింద నిద్రపోతారా ఎవరైనా? ఈమాత్రం బుద్ధిలేదు యీ పిల్లకి? పైగా డాక్టరుట. మొన్న పి.జి.ఎంట్రన్స్ రాసింది. ఈవిడకి సీటువస్తే నన్నడగండి.

"ఇక్కడ హాయిగా నిద్రపోతున్నావా తల్లీ" మళ్ళీ బొజ్జమ్మే.

నిజం చెప్పొద్దూ దొంగనిద్రపోతున్నాను.

"యింతకీ లేవడం లేదు వెధవ. నువ్వు కొట్టమ్మా కాకుల్ని" మరేఁ కాకుల్ని కొట్టడానికి, ఎలుకల్ని పట్టడానికీ కాబోలునేనీ యింట్లో వున్నాను!

నిజానికి వీళ్ళేం నన్ను కన్నారా?

హాయిగా మా అమ్మతో చర్చి వార్డెనుగారింట్లో వుండేదాన్ని. ఆ వార్డెను చర్చి డబ్బు తినేసేడని అందరూ అనుకున్నా నన్నూ అమ్మనీ ప్రాణంగా చేసుకునేవాడు. మా అమ్మ ఎంత బావుంటుందనీ? మల్లెపువ్వు లేదు, మల్లెపువ్వు అంత తెల్లగా ఉంటుంది. నేను పుట్టి పది రోజులైనా కాలేదు, యిదిగో యీ సుందరమ్మ మహాతల్లి నన్ను కొనేసింది. ఎంతకో తెలుసా?

ముష్టి మూడొందలకి. మూడు వేలైనా కాదు!

అసలు మా పూర్వులది ఇంగ్లండు. మా వంశంలో బ్యూటీ కాంపిటీషన్లో ప్రైజు లొచ్చిన వాళ్ళు చాలామంది ఉన్నారు. యింతకీ నా వంశం గురించి ఎంత చెప్పి ఏం లాభం? యీ సుందరమ్మ సంగతి వినండి.

ఈవిడికి మొదట యిద్దరూ కూతుళ్లు. వాళ్ళు డాక్టర్లని ఆవిడకి తెగ గర్వంలెండి. నా మొహం డాక్టర్లు. ఏనాడూ ఎవ్వరికీ యింజెక్షన్లు ఇవ్వటం నేను చూళ్లేదు. ఆ మధ్య పార్వతి –

అంటే పెద్ద కూతురు అమలాపురమో అంబేరుపురమో వెళ్ళింది. ఎందుకని అడగరేం? పని నేర్చుకుంటుందిట పని. ఈవిడ పని నేర్చుకోవడానికి మరో ఐదేళ్ళు పడుతుంది. అసలేవైఁనా వస్తేకదా.

యింక రెండో ఆవిడ–ఈవిడకి తను చాలా తెలివైన దాన్నన్న నమ్మకంతోపాటు మిగిలినవాళ్ళంతా వెధవలన్న నమ్మకం కూడా ఉంది. ఆ పెద్దపిల్లే నయం తనకేఁవీఁ రాదని ఒప్పేసుకుంటుంది. ఈవిడ మాత్రం చీఫ్ తరువాత తనే అంటుంది. పొద్దున్నే ముస్తాబై రిక్షాలో ఎక్కడిలో వెళ్ళిపోవడం, మంచి ఎండ మండిపోతుంటే ఏ వంటి గంటకో పిచ్చెక్కిన ఆల్సేషియన్లా రుసరుస రావడం, వాళ్ళ పాత చీఫ్‌నో, కొత్త డి.ఎం.ఎస్.నో మూడు తరాలు తిట్టడం, భోంచేసి ఏ 'ఉడ్ హౌసో' పట్టుకొని నిద్రపోవడం, యిదీ యీవిడ రోటీన్.

సరే ఆ "తాతా" జనరల్ మేనేజరుగాడు లేడూ – అరుణ్ గాడు, వాడు నా ఎనిమి నెం.1. కొంగలా రూపూ, గెద్దలా ముక్కూ వీడూను. వీడి సీక్రెట్‌లన్నీ నాకు తెలుసు. నాకెందుకని వూరుకుంటున్నాను. ఓసారి..... వీడి క్లాస్‌మేట్ – చీపురుకట్టకి చీర కట్టినట్టు రూపు అదీని, అందుకే అంటారు టేస్ట్స్ డిఫర్ అని – అదిగో దాన్నెక్కించుకొని స్కూటరు లాగించేడో లేదో నేను అలా పరిగెత్తేను కావాలనే. ఆఫ్‌కోర్సు దెబ్బతగలకుండా జాగ్రత్త పడ్డాననుకోండి. చీపురుకట్ట గుంట బుగ్గిలో పడింది కదూ, లేసరికి బూజుకర్రలా ఉందనుకోండి. దొరికిందే ఛాన్సు అనుకొని వీడు "సారీ, సారీ" అంటూ ఆ గుంట జెబ్బ పట్టుకొని లేవదీసేడు, ఈలోగా నేను పారిపోయేను.

వీడికి ఆ చిన్నీకి ఉన్నదంతా భేదమే. పోలికల్లా యిద్దరూ దొంగతనంగా సిగరెట్లు కాల్చడంలోనే. ఒక తల్లికి పుట్టేరంటే నమ్మకం కష్టవేఁ. వీడు ఆజన్మ నిరాహారం పూనినా కొంగలా ఉంటే, చక్కగా, ముద్దుగా మూడేళ్ళ గున్న ఏనుగులా ముద్దొస్తూ ఉంటాడు చిన్ని. వాడే జిన్నా అయితే వీడు గాంధీ. నేను అన్నం తిన్నానో లేదో, పాలు తాగేనోలేదో చూసేది చిన్ని ఒక్కడే. నాకు ఒంట్లో బాగులేకపోతే డాక్టరు దగ్గరికి తీసికెళ్ళేది వాడే. పాపం వాడి గుండె పెద్దదే. బ్రెయినే చిన్నది. హైథర్డ్‌క్లాస్ వస్తే యూనివర్శిటీ ఫస్ట్ వచ్చినంత సంతోషిస్తాడు. ఎప్పటికైనా "బీ కాం" అయిందనిపించుకుంటే చాలని వాడి ఆశ.

వీడూ, నేనూ, లల్లూ ఓ పార్టీ అంటే సుందరమ్మకి అపోజిషన్. నా ఆలనా, పాలనా చిన్ని చూస్తే ఆటా, పాటా లల్లూ చూస్తాడు. నాకు కథలు కూడా చెప్తాడు. సర్‌ప్రైజు ఎండింగ్ యివ్వడంలో లల్లూ ముందు ఓహెన్రీ ఎందుకూ పనికి రాడనిపిస్తుంది. కృష్ణుడి నోట్లో సర్వ ప్రపంచాలూ చూసిన యశోద ఏవందిరా అంటే "నోర్ముయ్ క్రిష్టా" అంది అంటాడు. మీరు నమ్మరు కాని వాడికి నాలుగేళ్ళు నిండలేదు. ఇంతకీ లల్లూ ఎవరో చెప్పలేదు కదూ. ఏఁవిఁటో యివేళ మనసంతా చికాగ్గా ఉంది. అదిగో, అమలాపురమో, ఆత్రేయపురమో వెళ్ళిందన్నానే ఆవిడగారి పుత్రుడు.

వీళ్ళింట్లో నాకు ఎవరంటే ఎక్కువిష్టమో తెలుసా? జడ్జీగారంటే. మూణ్నెలల్లకోసారి మందుకొట్టినా గాంధీ గారి లాంటివాడు. పాపం, ఆ మధ్య చిన్న పిసరు హార్టు ఎటాక్ లాంటిది వచ్చింది. రాకేం చేస్తుంది? ఈ వయసులో రిటైరై, హాయిగా కృష్ణా, రామా అనుకోకుండా యీ సోమరిపోతుల్ని పోషించడానికి, ఏవిఁటమ్మా ఆ ఊరు, ఢిల్లీనో, డేరాఢూనో అక్కడకి పోయి బతకలేక బడిపంతులని, కలక్టర్లకో ఎవరికో పాఠాలు చెప్తున్నాడు.

ఇంతకీ ప్రారంభించింది నా కథ. చెప్తున్నది సుందరమ్మ కథ. ఆవిడంతే ఆఖరికి కథలో కూడా దయ్యంలా పట్టుకుంటుంది. చిన్నప్పుడు నన్ను ముద్దుగానే చూశేరు. ఎత్తుకొని దించేవారే కాదు. సోఫాలోంచి దిగేదాన్ని కాదు. "మా రాణి చూశేరా ఎంత ముద్దుగా వుందో" అని సుందరమ్మ మహా గొప్పగా చెప్పేది. అలాంటిది యిప్పుడు కేవలం కాకుల్ని కొట్టడానికీ, పిల్లుల్ని పట్టడానికీ పెట్టేశేరు.

అసలీ మధ్య నాకూ, సుందరమ్మకీ సరిపట్టం లేదు. ఎందుకనడక్కండి. జడ్జిగారన్నట్టు జెస్టు ఇన్‌కంపాటబిలిటీ ఆఫ్ టెంపర్మెంట్. అసలావిడకి ఎవరితో పడుతుంది? జడ్జీగారితో పడదు. "ఎన్నెన్" గారితో పడదు, "ఎన్నెన్" గారంటే ఎవరో చెప్ప లేదు కదూ. వీళ్ళ ఫ్రెండు. ఆయనా డాక్టరే. కంటి డాక్టరుట. చూడ్డానికి మేకప్ అక్కర్లేని రావణాసురుడిలా వున్నా పాపం మహా మంచివాడు. నాకు ఆ మధ్య కంటి కురుపైతే రెండ్రోజుల్లో నయం చేశేడు ... తమాషా ఏవిఁటంటే యీ సుందరమ్మ అందర్నీ అలిసిపోయే వరకు తిట్టి ఆఖర్న తనని అందరూ బాధ పెడుతున్నారంటుంది. బావుంది కదూ! అందుకే "ఎన్నెన్"గారంటారు. "మీది పెర్సిక్యూషన్‌మేనియా" అని. దాని అర్థం నాకు తెలీదనుకోండి. కాని ఎందుకో అతను కరక్టే అనిపిస్తుంది.

నాకావిడ మీద ఎంత కోపం అంటే, ఆవిడ అప్పుడప్పుడు యింటికి తాళం వేసి, నన్ను కాపలాపెట్టి షికారెళ్తుందే, అలాం టప్పుడు ఎవర్నైనా దొంగని పిల్చి యిల్లు అప్పగించేద్దాంా అని పిస్తుంది.

కాని ..... ఏవుంది వీళ్ళింట్లో ఎత్తుకు పోవడానికి? మట్టి గాజులూ, కుక్క గొలుసులూ తప్ప.

నా తల్లికి చిన్నమెత్తు బంగారం లేదుకదా, యిన్నేళ్ళి జడ్జీగారి జీతం అంతా ఏం చేస్తోందో కాని ...

అదిగో వస్తోంది, మేడ పునాదుల్తో సహా అదరిపోయేటట్టు నడకా ఆవిడాను.

తల్లి వెనకే కూతురూ వచ్చింది.

"ఉట్టిదే, దొంగ నిద్ర" అంది కూతురు.

నాది నిజంగా దొంగనిద్ర కాబట్టి సరిపోయింది కాని లేకపోతే ఆ మాటలకి ఎంత హర్ట్ అయ్యేదాన్నో.

"ఫేన్ కట్టేయి, వెధవ అదే లేస్తుంది" అర్డరేసింది తల్లి.

అమలు జరిపింది కూతురు.

ఫేన్ కింద పుట్టి, ఫేన్ కిందే పెరిగేను కదూ. మరింక ఫేను లేకపోతే అరక్షణం వుండలేను. చచ్చినట్టు లేచి కూర్చు న్నాను. నేను లేచేక పడగ్గదిలోకి వెళ్ళిపోయారు తల్లీ కూతుళ్ళు. నన్నూ రమ్మంటారేమోనన్న ఆశ, ఆశగానే మిగిలి పోయింది. నెమ్మదిగా తొంగిచూశేను. ఏవుంది? చెరో మంచం మీద బోర్లా పడుక్కుని పుస్తకం చదువుకుంటున్నారు. మరో అయిదు నిముషాల్లో గుర్రు పెట్టేస్తారు. నేను మాత్రం ఫేను కూడా లేకుండా వాళ్ళ యిల్లు కాపలా కాయాలి! ఆ మధ్య ఎవరు చెప్మా? శాస్త్రిగారో,ఎవరో కాని రాశేరు ఆడవాళ్ళకి పగటి నిద్ర పనికి రాదని, వీళ్ళా ఆడవాళ్ళు?

ఏంచిటో నాకూ బద్ధకంగానే ఉంది. పొద్దున్నంతా రాజీతో వాళ్ళ తోటలో పరుగెత్తేనా, కాళ్ళు పీకుతున్నాయి. కాని కాపలా కాయాలి. గాంధీగారన్నట్టు "డ్యూటీ ముఖ్యం".

అదుగో అప్పుడొచ్చేరు 'బాసు'గారని వీళ్ళ ఫ్రెండు – అతనూ డాక్టరే. విచిత్రం అతను ఏలోపతీ చదివి హోమియో చేస్తాడు! వచ్చి లోపలికి వెళ్ళి మొహం కడుక్కుని, తల దువ్వుకొని, హాల్లో ఓ అయిదు నిమిషాలు కూర్చుని ఓ సిగరెట్టు కాల్చుకొని లోపల కెళ్ళి వాళ్ళ "సర్వేసేనా మూర్చ" చూసి, మళ్ళీ వచ్చి మరో సిగరెట్టు కాల్చి వెళ్ళిపోయేడు. వెళ్తూ, వెళ్తూ టేబిలు మీద టేప్ రికార్డరు పెట్టి వెళ్ళిపోయేడు. అది యీ సుందరమ్మే రెండు వేలకో, పన్నెండు వందలకో కొన్నాది.

భానుగారు వెళ్ళిపోయేక చెప్పొద్దూ, నాలో విభీషణుడు లేచేడు.

ఎవరైనా వచ్చి యీ టేప్‌రికార్డరుఎత్తుకుపోతే తిరపతి ఏడు కొండలూ మంచినీళ్ళడక్కుండానడచి ఎక్కుతానని మొక్కుదావని పించింది.

"మొక్కనా? వద్దా" అన్న డైలమాలో వుండగానే వచ్చేడు ఒకపెద్ద డాకూ లాంటి వాడు.

ఆహాఁ! వెంకటేశ్వరా! దేవుడంటేనువ్వేనయ్యా.

ఈ డాకూని యింతకుముందు నేనెప్పుడూ చూడలేదు. బ్రిల్‌క్రీము ఎడ్వర్‌టైజ్‌మెంటులా జుత్తూ వీదూను. దేశ భక్తుడిలా ఖద్దరు బట్టలు వేసుకున్నాడు. భుజాన ఖద్దరు సంచీ చూడగానే వీడెవడో గజదొంగ అనిపించింది.

రాగానే డ్రాయింగు రూములో అటుయిటు తిరిగేడు. తిరిగి టేబులుదగ్గర ఆగేడు. వీడి అమ్మ కడుపు చల్లగా అత్త కడుపు చల్లగా, ఆ టేప్ రికార్డరు పట్టుకుపోడేం? పోనీ నేను చూస్తున్నానన్న భయంఏమో అనుకుంటే, నేను గట్టిగా కళ్ళు మూసు కున్నానే.

వాడి మొహం చూస్తే ఎందుకో గాని వీడు ఖచ్చితంగా టేప్ రికార్డర్ల దొంగే అనిపించింది.

డాక్టర్లలో లాగే దొంగల్లో కూడా స్పెషలిస్టులుంటారు. అమ్మయ్య నా ఆశ ఫలించింది. వాడు ఆ రికార్డను పట్టు కున్నాడు. ఊరికే దాన్ని అటూ, ఇటూ తిప్పుతాడేతప్ప ఎంతకీ పట్టుకు పోడేం?

ఓ అయిదు నిమిషాలు హిచ్‌కాక్ సినీమాలో లాంటి సస్పెన్సు. తరవాత మళ్ళీ దాన్ని టేబిలు మీదే పెట్టి సుందరమ్మ వాళ్లు పడుక్కున్న గదిలోకి వెళ్ళేడు.

వెళ్ళినవాడు ఊరుకున్నాడా? చిటికెలు వేశేడు. వాళ్ళ నిద్ర టెస్టు చెయ్యడానికి. బాంబులు పేలినా లేవని సరుక్కి చిటికెలు ఒక లెక్కా?

మళ్ళీ డ్రాయింగురూములోకొచ్చి ఓ ఫారిన్ సిగరెట్టు వెలి గించి, ఖాళీ సిగరెట్టు పెట్టె అక్కడే పారేసి, టేప్ రికార్డరు సంచీలో వేసుకొని వెళ్ళిపోయాడు.

ఈ దొంగ వెధవ ప్రేమకథలు తప్ప డిటెక్టివు కథలు చదివి నట్టు లేదు. పీకపోవడానికి సిగరెట్ పెట్టె అక్కర్లేదు. సిగరెట్ పీకచాలు. నాలుగు గంటకి అంతా లేచేరు.

టేప్ రికార్డరు పోయినట్టు వీళ్ళకితెలియాలంటే "బాసు" గారు రావాలి. "బాసు" రావాలి, "బాసు" రావాలి. భగవంతుడ్ని ప్రార్థన ప్రారంభించేను. ఇందాక మొక్కకుండానే కోరిక తీర్చిన దేవుడు ఈసారి మూడు గంటలు మెడిటేషను చేయించేడు.

అంతా భగవంతుడి లీల!

మొత్తానికి "బాసు" ప్రత్యక్షమయ్యేసరికి ఏడైంది. ఇందాక ఇతడు హోమియో చేస్తాడన్నాను కదూ. అది అబద్ధం కాదు కాని నిజం చెప్పాలంటే ఇతను స్టీలు ఫేక్టరీ ఒకటి పెట్టేడు. గిన్నెలు తయారీకి మెడిసన్ ఎందుకు చదివేడో అర్థం కాదు. ఇంత వరకు ఒక్క చెమ్చా కూడా తయారు చెయ్యలేదు.

వచ్చిన దగ్గర్నుంచి తను చెయ్యబోయే గిన్నెలూ, గ్లాసులూ బొమ్మలు గీసి చూపిస్తాడే తప్ప రికార్డరు సంగతి చెప్పడే. ఎప్పటి కైనా చెప్పడా అని అతని పక్క కుర్చీలోనే కూర్చున్నాను.

కాఫీలు తాగుతున్నాడు.

సిగరెట్లు కాలుస్తున్నాడు.

రాత్రి పదైంది. అయినా రికార్డరు ఊసు లేదే! ఇంక ఈ వేళ ఈ దొంగతనం సంగతి తెలీదు కాబోలని, నిద్ర పోదావను కున్నంతలో ఆపద్బాంధవుడిలా వొచ్చేడు ఇందాకటి ఖద్దరు దొంగ.

ఓరి! నువ్వు మామూలు దొంగవికావురా. అసల్సిసలు చార్ సౌబీస్.

వాడ్ని వీళ్లెవరికీ తెలీనట్టుంది. వాడే యింట్రడ్యూస్ చేసు కున్నాడు. ఏదో పేర్లు చెప్పేడు కాని మరిచిపోయాను. వాడిది హైదరాబాదట. కథలు రాస్తాట్ట. టేప్ రికార్డర్లు కూడా కొట్టే స్తాడని అరవబోయి మానేశాను. మా సుందరమ్మ కథలంటే వెర్రిట. అప్పుడు ఆవిడ మొహం చూడండి 70 ఎం.ఎం.లో తప్ప ఫోటో తియ్యలేం. అంత పొంగిపోయింది.

అన్నట్టు యీ కవిగాడికి సంగీతం అంటే పిచ్చట. (దొంగ తనం హాబీనా?)

దొంగకి కాఫీ యిచ్చేరు. మళ్ళీ అందరూ తాగేరు.

అదేదో సినీమాలో చెప్పినట్టు "ఎవరైనా వస్తే కాఫీ, రాకపోతే కాఫీ, పనుంటేకాఫీ, పన్లేకపోతే కాఫీ". జడ్జిగారి జీతం అంతా ఎలా అయిపోతోందో యిప్పుడర్థమైంది.

"మధ్యాహ్నం మూడింటికి వచ్చేడు. యివేళ యీఊర్లో బాల మురళీకృష్ణ కచేరి వుందిట. నిజంగా ప్రాణం ఉసూరు మంది. టేప్ రికార్డరు తెచ్చుకోలేదేనని. యీలోగా మిమ్మల్ని పలకరించు దావఁని మీ యింటికి వచ్చేను. తీరా యింతదూరం వస్తే మీరంతా నిద్రపోతున్నారు. టేబిలు మీద బ్రహ్మాండమైన టేప్ రికార్డుంది. చెప్పకుండా తీసుకెళ్తే ఏమనుకుంటారో ?....

శెబాష్. వీడండి చార్‌సౌబీస్. తను ఇల్లు వదిలే సరికి రికార్డును టేబిలుమీదే వుందంటాడేఁవిటి? కొంపదీసి దొంగ తనం నామీదకి రాదుకదా? కుర్చీ చివరికి జరిగి శ్రద్ధగా వింటున్నాను.

"బాలమురళీకృష్ణే జయించేడు. తరువాత క్షమాపణలు చెప్పుకోవచ్చని రికార్డరు తీసికెళ్ళేను. యిదిగో క్షమించండి. అడగకుండా తీసికెళ్ళినందుకు ...."

ఇంక అక్కడ ఒక్క క్షణం కూడా ఉండాలనిపించక గదిలోకి వెళ్ళిపోయాను.

ఛీ ! ఛీ!! ఏం మనుషులు?

**(జ్యోతి, దీపావళి 10.11.1980)**

# డూటీ

**ఎం**త చెడిపోయిన ఆడదయినా పైట జార్చి పదిమందిలోనూ ఎవర్నీ రమ్మని అడగదు. ఈ సుశీలలూ, మేరీలు, సుల్తానాలు వీళ్ళంతా ప్రాస్టిట్యూట్స్. అయితే కేసులు మాత్రం అబద్ధం. ఇలాంటి కేసులు సంవత్సరానికి ఇన్ని పెట్టాలని పోలీసుల రూల్స్.

పర్సులో మాత్రమే పెట్టేది – అందరికీ, ఇచ్చేది – అయితే డబ్బు కాకపోతే.

"బూడిద" అనేసి కాఫీ కలపడానికి వంటింట్లోకి బైల్దేరేను.

మా చిన్నల్లుడు తుళ్ళిపడ్డాడు.

చిన్నది నవ్వబోయి దగ్గింది.